## క్లుప్తంగా

### ఫ్లెక్సీల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

**రుద్రవరం:** మండలంలో ఎవరైనా ఫ్లెక్సీలు,బానర్లు ఏర్పాటు చేసుకోవాలంటే ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్‌ఐ వరప్రసాదు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. కొత్త సంవత్సరం, సంక్రాంతి వంటి పండుగల సందర్భంగా ఫెక్సీలు,బానర్లు ఏర్పాటు చేసుకోవాలంటే ముందస్తుగా అనుమతి తప్పనిసరని చెప్పారు. అలాకాకుండా ఇష్టానుసారంగా, ఎక్కడబడితే అక్కడ ఏర్పాటు చేస్తే చట్టపర చర్యలు తప్పవని హెచ్చరించారు.

### ముగిసిన అంతర్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీఐ బాలమద్దిలేటి

**కొలిమిగుండ్ల:** క్రిస్మస్ పండుగ సందర్భంగా బెలుం సీఎస్‌ఐ చర్చి సంఘ పెద్దల ఆధ్వర్యంలో చర్చి ఆవరణలో నిర్వహించిన అంతర్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు బుధవారం ముగిశాయి. వివిధ ప్రాంతాల నుంచి 30 జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. హోరా హోరీగా పోటీలు సాగాయి. స్థానిక సీఐ రమేష్‌రెడ్డి, బెలుంకు చెందిన వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు రూరల్ సీఐ బాలమద్దిలేటి ఫైనల్ మ్యాచ్ క్రీడాకారులను పరిచయం చేసుకొని మ్యాచ్‌ను ప్రారంభించారు. ఉత్కంఠగా సాగిన పోటీల్లో అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన శివ టీం మొదటి స్థానాన్ని కైవసం చేసుకోగా, తాడిపత్రికి చెందిన టీసీఈ స్పోర్ట్ క్లబ్ టీం రెండో స్థానంలో నిలిచింది. కొలిమిగుండ్ల మహేష్ టీం మూడవ స్థానం, బనగానపల్లెకు చెందిన టార్గెట్ టీం నాల్గవ స్థానంలో నిలిచాయి. విజేత జట్లకు దాతల సహకారంతో సీఐల చేతుల మీదుగా రూ.20,016, రూ.15,016,రూ.10,016,రూ.5016ల నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో బహుమతి దాతలు సర్పంచ్ నీలం మారమ్మ, కొలిమిగుండ్ల ధనరాజు, ఏసేయ్య తదితరులు పాల్గొన్నారు.

### చండీయాగానికి నేడు పూర్ణాహుతి



యాగశాలలో పూజలు నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు, వేదపండితులు

**బనగానపల్లె రూరల్ :** మండంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారి దీక్ష విరమణ సందర్భంగా ఈ నెల 22 నుంచి నిర్వహిస్తున్న చండీయాగం గురువారం పూర్ణహుతి కార్యక్రమంతో ముగుస్తుందని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ బుధవారం తెలిపారు. చండీయాగంలో భాగంగా బుధవారం ఉదయం అమ్మవారికి కుంకుమార్చన అభిషేకం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు వేదపండితులు శివుడు, యాగశాలలో ఏర్పాటు చేసిన చౌడేశ్వరిదేవి ఉత్సవమూర్తికి వేదమంత్రోచ్చరణతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం జరిగింది.

### కిరాణాషాపులో చోరీ

**కోవెలకుంట్ల:** పట్టణంలోని జమ్మలమడుగు చౌరస్తాలో మంగళవారం అర్ధరాత్రి ఓ కిరాణా కొట్టులో చోరీ జరిగింది. స్థానికులు అందించిన సమాచారం మేరకు.. కోవెలకుంట్లకు చెందిన రాజేష్ రాత్రి కిరాణా షాపు షట్టర్‌కు తాళం వేసి ఇంటికి వెళ్లాడు. గుర్తు తెలియని దొంగలు షట్టర్‌కు వేసిన తాళాలు పగలగొట్టి లోనికి ప్రవేశించారు. కౌంటర్ టేబుల్‌లో ఉన్న రూ. 8 వేల నగదు, సిగరెట్ ప్యాకెట్లను అపహరించుకెళ్లారు. బుధవారం ఉదయం షాపుకు వచ్చేసరికి షట్టర్ తెరిచి ఉండటంతో చోరీ జరిగిందని గుర్తించి పోలీసులను ఆశ్రయించాడు. చోరీ ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

### గడ్డివామికి నిప్పు



కాలిపోయిన వరి గడ్డి

**డోన్ టౌన్:** పట్టణ సమీపంలోని కోట్ల భాస్కర్ రెడ్డి నగర్‌లో నివాసం ఉంటున్న సుధాకర్ నాయుడుకు చెందిన గడ్డివామి అగ్నికి ఆహుతైంది. పాడి పశువుల కోసం నిల్వ చేసుకున్న వరి గడ్డికి మంగళవారం రాత్రి నిప్పు రాసుకొని మంటలు చెలరేగడంతో బాధిత కుటుంబ సభ్యులు ఇంటికి ఉన్న బోరు పైపుతో నీటిని చల్లి మంటలను అదుపు చేశారు. ఈ అగ్ని ప్రమాదంలో సుమారు రూ.80 వేల విలువ చేసే వరి గడ్డి కాలి పోయినట్లు బాధితులు వాపోయారు. గుర్తు తెలియని వ్యక్తులు గడ్డివామికి నిప్పు పెట్టినట్లు బాధితుడు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



నంద్యాలలో మేరిమాతాను ఊరేగిస్తున్న దృశ్యం



హోలీక్రాస్ కెథడ్రల్ చర్చిలో దైవ సందేశం ఇస్తున్న రిటైర్డ్ బిషప్ పుష్పలలిత



నంద్యాలలో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు



శిరివెళ్లలో ఏసు జననం బొమ్మలకొలువు

# క్రీస్తు మార్గం అనుసరణీయం

• జిల్లాలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

**నంద్యాల(న్యూటౌన్):** మానవాళి మధ్య శాంతి, కరుణ, సహోదర ప్రేమను నెలకొల్పేందుకే క్రీస్తు ఈ లోకానికి వచ్చారని ఏసు జననం మానవాళికి రక్షణ కవచమని హోలీక్రాస్ కెథడ్రల్ చర్చి రిటైర్డ్ బిషప్ పుష్పలలిత, జోసెఫ్ బాబు, హోలీక్రాస్ కెథడ్రల్ పాస్టరేట్-2 (ఆల్‌సెయింట్ చర్చి)లో రెవరెండప్ ఇమ్మానియేల్ పేర్కొన్నారు. బుధవారం నంద్యాల జిల్లాలోని బనగానపల్లె, ఆళ్లగడ్డ, నందికొట్కూరు, పాణ్యం, డోన్, నంద్యాల, శ్రీశైలం నియోజకవర్గాల్లోని ఆర్‌సీఎం చర్చి, కెథడ్రల్ చర్చి, ఆరోగ్య మాత చర్చి, మేరిమాత చర్చి, సీఎస్‌ఐ చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం అర్ధరాత్రి నుండే క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. నూతన వస్త్రాలు ధరించి ప్రార్థనల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. క్రైస్తవులకు ప్రధానమైన పండుగ కావడంతో చర్చీలు భక్తులతో నిండిపోయాయి. గ్రామాల్లో ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా ప్రధానంగా చర్చిల్లో ఏసు జన్మించిన పశువుల పాకలను ఏర్పాటు చేశారు. హోలీక్రాస్, వైఎస్సార్‌నగర్ లోని క్రిస్టియన్ అసెంబ్లీలో బ్రదర్ రాజారావు, జయరాజు పాల్గొని దైవసందేశం ఇచ్చారు.

**శిరివెళ్ల:** మండలంలో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం రాత్రి నుంచే వేడుకలు ప్రారంభమయ్యాయి. చర్చీలను రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరంచారు. అర్ధరాత్రి ప్రార్థనలతో వేడుకలు ప్రారంభం కాగా చర్చీల వద్ద పెద్ద ఎత్తున బాణా సంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. బుధవారం శిరివెళ్ల, యర్రగుంట్ల, గోవిందపల్లె, కామినేనిపల్లె, బోయలకుంట్ల, మహదేవపురం, కోటపాడు చర్చీల్లో ఫాదర్లు ఉపదేశాలిచ్చారు.



చాగలమర్రి ఎస్‌పీజీ చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు

**చాగలమర్రి:** క్రీస్తు మార్గాన్ని అనుసరించాలని ముత్యాలపాడు ఎస్‌పీజీ చర్చి ఫాస్టర్ రెవ.ఆడమ్ ఇమ్మానియల్ సంజీవరాజ్ భక్తులకు బోధించారు. బుధవారం మండలంలో ప్రత్యేక ప్రార్థనలు, ఆరాధనలలో క్రైస్తవులు పాల్గొని క్రిస్మస్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ముత్యాలపాడు ఎస్‌పీజీ చర్చిలో పాస్టర్ రెవ.ఆడమ్ ఇమ్మానియల్ సంజీవరాజ్ క్రీస్తు సందేశాన్ని వినిపించారు. అనంతరం చర్చి చూట్టూ శిలువతో కోరస్‌లు, మత పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులతో కలిసి ప్రదక్షిణ నిర్వహించారు. చర్చి నిర్మాణ పితామహుడైన సర్ డెండ్లీ షేఫ్పర్డ్ సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చిలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో హంగేరి దేశానికి చెందిన ఫ్రాన్సిస్, హోల్డ్ డొనాల్డ్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ సౌత్ ఇండియా పర్యటనలో ఇక్కడి వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు.

**రుద్రవరం:** క్రీస్తు సందేశాన్ని మానవాళి అనుసరించాలని రుద్రవరం సీఎస్‌ఐ చర్చి ఫాస్టర్ రెవరెండ్ సురేష్ బాబు అన్నారు. మండలంలో బుధవారం క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రుద్రవరం సీఎస్‌ఐ చర్చిలో పాస్టర్ మాట్లాడుతూ కరణ, ప్రేమ, క్షమ, సహనం, దాతృత్వం,త్యాగం ఇవన్నీ తన జీవితం ద్వారా క్రీస్తు మానవాళికి అందించిన మహోన్నత సందేశాలని ఉపదేశించారు.

**ఆళ్లగడ్డ:** మంగళవారం రాత్రి నుంచి చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రిస్మస్ తాత వేషధారణలో చిన్నారులు అలరించారు. అర్ధరాత్రి అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి పంచుకున్నారు. తెల్లవార్లు పెద్దెత్తున బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. బుధవారం నియోజవర్గంలో క్రైస్తవులు పండుగను ఘనంగా జరుపుకున్నారు. క్రీస్తు సూచించిన మార్గాన్ని అనుసరించాలని మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు.పట్టణంలోని సీఎస్‌ఐ చర్చిలో నిర్వహించిన ప్రార్థనలుకు ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

**ఉయ్యాలవాడ :** మండలంలో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక హోసన్నా మందిరంలో పాస్టర్ రమేష్ క్రీస్తు భోదనలను వివరించారు. అనంతరం చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆయా చర్చీల్లో పాస్టర్లు జోషి, సత్యరాజు ప్రార్ధనలు చేయించారు.



ఆళ్లగడ్డలో ప్రార్థనల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

**నంద్యాల(అర్బన్):** మండలంలోని గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. క్రీస్తు జననం మానవాళికి శుభ దినమని పాస్టర్లు సందేశం ఇచ్చారు. మండలంలోని పోలూరు,పెద్దకొట్టాల, భీమవరం, అయ్యలూరు, చాబోలు, కానాల, చాపిరేవుల, పుసులూరు, మిట్నాల, తదితర గ్రామాల్లో ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ప్రత్యేక ప్రార్థనలు, పూజలు నిర్వహించారు. చీకటి నిండిన ఈ లోకంలో నింగి నుంచి తార భువికి దిగిన వేళ క్రీస్తు లోకానికి వస్తూ ప్రేమ, శాంతి సందేశం తీసుకొని వచ్చారని ప్రసంగీకులు వివరించారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని 26వ వార్డు కౌన్సిలర్ చంద్రశేఖర్, దేవభూషణం ఆధ్వర్యంలో స్థానిక సెయింట్‌లుక్స్ అంధుల పాఠశాల విద్యార్థులకు దుప్పట్లను పంపిణీ చేశారు.



దుప్పట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

**దొర్నిపాడు:** మండలంలో క్రిస్మస్ పండుగను క్రైస్తవులు బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేకువజామునుంచే చర్చిల్లో ప్రార్థనలు చేసి క్రీస్తు పుట్టుక సంబంధించి సందేశాలు, కీర్తలను ఆలపించారు. ముఖ్యంగా క్రిష్టిపాడు గ్రామంలో యువకులు సూరిబాబు, బాల లింగమయ్య, సాగర్‌లు చిన్నారులకు, పెద్దలకు ఆటల పోటీలు నిర్వహించి పోత్సాహక బహుమతులు అందజేశారు.



చిన్నారులకు క్రిస్మస్ కానుకలను అందజేస్తున్న యువకులు



శిరివెళ్ల చర్చిలో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న ఫాదర్



చాగలమర్రి : శిలువతో చర్చి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న కోరస్‌లు, క్రైస్తవులు



ఆళ్లగడ్డ సీఎస్‌ఐ చర్చిలో ప్రార్థనల్లో భక్తులు





భక్తులను ఆశీర్వదిస్తున్న పాస్టర్ రెవ.ఆడమ్ ఇమ్మానియల్ సంజీవరాజ్, ముత్యాలపాడు ఎస్‌పీజీ చర్చిలో భక్తి గీతాలు ఆలపిస్తున్న హంగేరి దేశానికి చెందిన దంపతులు



రుద్రవరంలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు





ఉయ్యాలవాడ హోసన్నా మందిరంలో దైవ సందేశాన్ని ఇస్తున్న పాస్టర్, ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

## ఆదర్శప్రాయుడు వాజ్‌పేయి



వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



నివాళులర్పిస్తున్న గ్రీన్‌సొసైటీ సభ్యులు

**నంద్యాల (వ్యవసాయం) :** నేటి యువత యువతకు మాజీ ప్రధానమంత్రి వాజ్‌పేయి ఆదర్శప్రాయుడని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇంటి ఆదినారాయణ పేర్కొన్నారు. బుధవారం మాజీ ప్రధాని అటల్‌బిహారి వాజపేయి శతజయంతి సందర్భంగా స్థానిక కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.నాయకులు చాందిని, తూము శివారెడ్డి రామచంద్రారెడ్డి, నాగేశ్వరరెడ్డి, గోపాలరెడ్డి, పుల్లారెడ్డి, భూమిరెడ్డి పాల్గొన్నారు. అలాగే గ్రీన్‌సొసటీ ఆధ్వర్యంలో వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధ్యక్షుడు దండు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్వార్థం ఎరుగని రాజనీతజ్ఞుడని కొనియాడారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, అన్నెం శ్రీనివాసరెడ్డి, సాంబశివారెడ్డి, రాజశేఖర, శేషఫణి పాల్గొన్నారు.

## దాడి.. కేసు నమోదు

**ఉయ్యాలవాడ :** మండలంలోని రూపనగుడి గ్రామానికి చెందిన శేషుగాళ్ల రమేష్, భార్య కుమారిపై దాడి చేయడంతో గాయపడగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. వివరాలు.. దంపతులిద్దరూ మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో చర్చికి ప్రార్థన కోసం బయలుదేరారు. ఈ సమయంలో అదే గ్రామానికి చెందిన మునలిగాళ్ల ప్రసాద్, నాగార్జున పాత కక్షలు మనసులో పెట్టుకుని రమేష్, కుమారిలను దుర్భాషలాడి దాడి చేయడంతో రమేష్‌కు తలకు తీవ్ర గాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ స్పష్టం చేశారు.



జులేపల్లెలో ధాన్యాన్ని సంచులకు నింపుతున్న రైతులు



ఎం.చింతకుంట్ల సమీపంలో ధాన్యానికి పట్టలు కప్పిన దృశ్యం

## తుపాను దడ

**గోస్పాడు:** అల్పపీడనం తుపాన్ మారి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో అన్న దాతల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఇప్పటికే మూడురోజులుగా వాతావరణం పూర్తిగా చల్లబడిపోయి, ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురవడంతో రైతులు అప్రమత్తమయ్యారు. భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్న సమాచారంతో వరి ధాన్యం రాసులు, బస్తాల నిట్లు కట్టి సంరక్షణ చర్యల్లో నిమగ్నమయ్యారు. పూతదశలో ఉన్న కంది పైరుతో పాటు మినుము పంట దెబ్బతింటున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

### వాతావరణ పరిస్థితులతో భయం



ప్రస్తుత వాతావరణ పరిస్థితులతో భయమేస్తోంది. ఎప్పుడు వర్షం పడుతుందో తెలియక ఆందోళన చెందుతున్నాం. ధాన్యం కళ్లంలోనే కుప్పలు వేసి ఉంచాను. వర్షానికి తడిస్తే అంతా నష్టపోవాల్సిందే. పెట్టుబడులు పెరగాయి. దిగుబడులు మాత్రం అంతంతమాత్రంగానే వచ్చాయి.

– బాలమద్దిలేటి, జిల్లెల్ల

### టార్పాలిన్ పట్టలను అధికంగా వాడాల్సి వస్తోంది



వరి పైరు సాగుచేసి పైరు కోత చేసే సమయంలో అవస్థలు పడాల్సి వస్తోంది. పైరును యంత్రం పెట్టి నూర్పిళ్లు పూర్తి చేశాం. ధాన్యాన్ని ఆరబెట్టేందుకు కూడా అవస్థలు పడుతున్నాం. వాతావరణ మార్పులతో గింజ తేమ కూడా ఆరటంలేదు. నాలుగు రోజులుగా మబ్బులు కమ్మి ఉండటంతో టార్పాలిన్ పట్టలు కొనాల్సివస్తుంది. అధికారులెవరూ టార్పాలిన్లు కూడా ఇవ్వలేదు. – నాగేశ్వరరెడ్డి, సాంబవరం



ఉయ్యాలవాడ వద్ద పూత, కాయ దశలోనున్న కంది పైరు



మాయలూరు సమీపంలో రహదారిపై వరి ధాన్యంపై పట్టలు కప్పిన దృశ్యం

**ఉయ్యాలవాడ :** మండలంలోని రైతులకు తుపాన్ దడ పుట్టిస్తోంది. రెండు రోజుల నుంచి ఆకాశం మేఘావృతమై ఈదురు గాలులు వీస్తున్నాయి. దీంతో ఖరీఫ్‌లో సాగు చేసిన వరి దిగుబడులు రహదారులు, కళ్లాల్లో ఆరబోసిన ధాన్యం వర్షానికి తడుస్తుందేమోనన్న భయం వారిని వెంటాడుతోంది. కంది, పప్పుశనగ, మినుము పంటలు ప్రస్తుతం పూత, కాయ దశల్లో ఉన్నాయి. ఈ తరుణంలో వాతావరణ శాఖ ఈ నెల 25 నుంచి తుపాన్ ఉంటుందని హెచ్చరించింది. దీంతో బుధవారం ఈదురు గాలులు వీస్తూ, ఉదయం నుంచి కారుమబ్బులు కమ్ముకుని చిన్న పాటి వర్షం కురిసింది. పూత, కాయ రాలిపోతుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

## హోరాహోరీగా బండలాగుడు పోటీలు

**ఓర్వకల్లు:** క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని మండల కేంద్రం ఓర్వకల్లులో బుధవారం నిర్వహించిన ఉభయ తెలుగు రాష్ట్రాలస్థాయి పాలపళ్ల విభాగం ఎద్దుల బండలాగు పోటీలు హోరాహోరీగా సాగాయి. స్థానిక ఏబీఎం సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలను వైఎస్సార్‌సీపీ నేత కాశిరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. 17 జతల ఎద్దులు పోటీపడగా యువత కేరింతల మధ్య ఉత్సాహంగా సాగాయి. తెలంగాణ రాష్ట్రం, నాగర్ కర్నూలు జిల్లా, రామవరం రామచంద్రారెడ్డి వృషభాలు మొదటి స్థానంలో నిలువగా దివంగత కాశిరెడ్డి వెంగళరెడ్డి కుమారులు కాశిరెడ్డి స్వామిరెడ్డి, కాశిరెడ్డి విష్ణువర్దన్‌రెడ్డి సంయుక్తంగా రూ. 35 వేలు అందజేశారు. రెండవ స్థానంలో నిలిచిన పాణ్యం మండలం, పిన్నాపురం వెంకటకృష్ణయ్య వృషభాలు రూ.30 వేలు, మూడవ స్థానంలో నిలిచిన వనపర్తి మండలం, పెద్ద దగడ పోగుల యశ్వంత్, పుత్తనూర్ పెద్దింటి నరేష్(ఉభయజత) వృషభాలు రూ.20 వేలు, నాల్గవ స్థానంలో నిలిచిన ఆళ్లగడ్డ మండలం బిల్లలాపురం భూమా గోవర్ధన్‌రెడ్డి వృషభాలు రూ.10 వేలు కైవసం చేసుకున్నాయి. అదేవిధంగా గురుజాల ధరని చౌదరి వృషభాలు, బి.తాండ్రపాడుకు చెందిన చిన్న రత్నం వృషభాలు, అనంతపురం జిల్లా, ఆత్మకూరుకు చెందిన విశ్వనాథ్‌రెడ్డి వృసభాలు సమానంగా లాగి ఐదు, ఆరు, ఏడు స్థానాల్లో నిలిచి రూ. రూ.3,300 చొప్పున బహుమతులు కైవసం చేసుకున్నాయి. వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లికార్జునరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, కోటేశ్వరరెడ్డి, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు చేట్ల రాజు, దానమయ్య, రెడ్డిపోగు ఆశీర్వాదం పాల్గొన్నారు.



పూజలందుకుంటున్న పెద్దమ్మ తల్లి



డోన్ వైపు రోడ్డుపై స్తంభించిన ట్రాఫిక్

## ముగిసిన కొచ్చెర్వు గ్రామ దేవర

**డోన్:** మండలంలోని కొచ్చెర్వు గ్రామంలో 20 ఏళ్ల తర్వాత బుధవారం నిర్వహించిన పెద్దమ్మ జాతర అంగరంగ వైభవంగా జరిగింది. గ్రామస్తులు, బంధుమిత్రులు, స్నేహితులు, సన్నిహితులతో గ్రామం కిక్కిరిసిపోయింది. మేజర్ గ్రామ పంచాయతీ కొచ్చెర్వు గ్రామంలో ప్రతి ఇంటి నుంచి మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో బోనాలు తీసుకెళ్లి పెద్దమ్మ తల్లికి సమర్పించారు. వేలాది మంది అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని, పాడిపంటలు, సుఖ శాంతులతో వర్దిల్లాలని ప్రతి ఇంటికి బూత్‌బిల్లి అనే వ్యక్తితో పాలి(జొన్న అన్నం) చల్లించుకున్నారు. గ్రామ దేవర సందర్భంగా మంగళ, బుధవారాలు అటు రాయలచెరువు రోడ్డు, ఇటు డోన్ రోడ్డుపై ట్రాఫిక్ స్తంభించిపోయింది. డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సీఐలు రాఘేష్, ఇంతియాజ్‌బాషా, మధుసూదన్‌రావ్‌లతో పాటు ఎస్‌ఐలు, పెద్ద సంఖ్యలో పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు.